# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం — తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 153 ప్రకాశం, బుధవారం 04- 03 - 2026 పేజీలు : 4 వెల. 2 /-








## ముఖ్య ప్రకటనలు

మీ ఇంట వివాహాది శుభకార్యములు

మీ పెళ్లిరోజు, పుట్టినరోజు మరియు

మీ వ్యాపార ఇతర కార్యముల కొరకు మా పత్రికలో

అతి తక్కువ ధరలకు ప్రకటనలు వేయబడును.

ఇతర వివరముల కొరకు


క్రైం కౌంటర్ దినపత్రిక ఉమ్మడి రాష్ట్రం కార్యాలయం

సత్తెనపల్లి, ఆంధ్రప్రదేశ్

Ph.No: 98497 07349


## హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి పూర్తిస్థాయి నిర్మూలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరు కృషి చేయాలి





**క్రైమ్ కౌంటర్ న్యూస్...ప్రకాశం జిల్లా....** హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి పూర్తిస్థాయి నిర్మూలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరు కృషి చేయాలని హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి, ఏ విధంగా సోకుతుంది మరియు సుఖ వ్యాధులు ఏ విధంగా వ్యాప్తి చెందుతాయి అనే విషయాలను ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి వి సాగర్ పేర్కొన్నారు సోమవారం అద్దంకి మండలం సింగరకొండ గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి శ్రీ ప్రసన్నాంజనేయ సింగరకొండ తిరుణాల సందర్భంగా దేవాలయానికి విచ్చేసే భక్తులకు ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రకాశం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ,దిషా ఆధ్వర్యంలో హెచ్ఐవి ఎయిడ్స్, మరియు సుఖ వ్యాధులు నిర్మూలన కొరకు అవగాహన కలిగించే స్టాల్ మరియు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి అక్కడికి వచ్చిన భక్తులకు కరపత్రాల ద్వారా వాల్ పోస్టుల ద్వారా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డి దుర్గా సురేంద్ర స్టాల్ ను సందర్శించిన వారికి తప్పని పరిస్థితుల్లో బయట వ్యక్తులతో శృంగారంలో పాల్గొనేటప్పుడు తప్పనిసరిగా కండోమ్ వాడాలని కండోమ్ ఏ విధంగా వాడాలి కండోమ్ లేకుండా విచ్చలవిడి శృంగారంలో పాల్గొంటే వచ్చే సుఖ వ్యాధుల గురించి హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి గురించి వివరించడం జరిగినది ఎవరైనా హెచ్ ఎయిడ్స్ వ్యాధి పైన సుఖ వ్యాధులు పైన తగు సూచనలు సలహాలు కొరకు జాతీయ టోల్ ఫ్రీ 1097 కు సమాచారం తెలియజేసి వారి అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చని రోజురోజుకు హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి చాప కింద నీరు లాగా సమాజంలో రోగుల సంఖ్య పెరుగుతుందని ఇది చాలా బాధాకరమైన విషయం అని హెచ్ఐవి ఎయిడ్స్ బాధితుల మరణాలు తగ్గించాలంటే వారు క్రమం తప్పకుండా మందులు వాడుకునే విధంగా చూడాలని అంతేకాకుండా వారి పట్ల వివక్షత విడనాడాలని పేర్కొన్నారు ఈ ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు డాక్టర్ జై సింహడాక్టర్ శ్రీ హర్ష ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు అద్దంకి, కోరిసపాడు ఔట్రిచ్ వర్కర్లు టి దుర్గా భవాని, డి హర్షిత, ఆర్ కృష్ణవేణి ఏ. ఎన్ ఎం మౌనిక పి. ఈ లు వి మల్లేశ్వరి సంధ్యారాణి, శివ పార్వతి పార్వతి పాల్గొన్నారు....

## నేటికీ అందని రేషన్ బియ్యం



**క్రైమ్ కౌంటర్ న్యూస్..**మార్కాపురం పెద్దారవీడు దోర్నాల తర్లుపాడు మండలాల్లో కొరత ఏర్పడిన రేషన్ బియ్యం

ఒకటి నుంచి 15వ తేదీ లోపు అందించాల్సిన రేషన్ బియ్యం మూడో తారీకు వచ్చిన పేదలకు అందని బియ్యం

మార్కాపురం ఎంఎల్ఎస్ పాయింట్ నుండి 80 పైగా రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేయని అధికారులు

రేషన్ బియ్యం సకాలంలో సక్రమంగా అందక పేదలు తీవ్ర ఇక్కట్లు

అధికారుల నిర్లక్ష్యమే కారణమని ప్రజలు విమర్శలు...

## అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి.





**క్రైమ్ కౌంటర్ న్యూస్...మార్కాపురం జిల్లా....** తర్లుపాడు. మార్చి 3.
అనుమాస్పద స్థితిలో గుర్తు తెలియని ఓ యువకుడు మృతదేహం తర్లుపాడు మండలం లోని తుమ్మలచెరువు నుండి చెన్నారెడ్డి పల్లి రహదారిలో మంగళవారం లభ్యమైంది.సమీప పొలాల్లోని కొందరు రైతులు విగతజీవిగా దుస్తులు లేకుండా గాయాలతో పడి ఉన్న మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇది హత్యా?.. లేక ఆత్మహత్యా? అన్న కోణంలో విచారణ చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. ఎవరైనా మృతదేహాన్ని గుర్తించిన ఎడల తర్లుపాడు ఎస్సై బి. బ్రహ్మనాయుడు సెల్. నెం.9121102176 కి తెలియజేయాలని తెలిపారు...

## క్షేత్ర మిత్ర బృందం పర్యటన



**వలేటివారిపాలెం క్రైశీ కౌంటర్ ప్రతినిధి పోకూరి మాల్యాద్రి,**2025-26 పంటకాలానికి పొగాకు బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఒంగోలు , కందుకూరు - 2 పొగాకు బోర్డు వేలం కేంద్రం ఆధ్వర్యంలో పొగాకు కంపెనీల ప్రతినిధులతో కలిసి క్షేత్ర మిత్ర బృందంగా ఏర్పడి కందుకూరు-×× పొగాకు బోర్డు వేలం కేంద్రం పరిధిలోని గ్రామాలలో పర్యటించి పొగాకు రైతులతో మాట్లాడి వారి యొక్క సమస్యలను తెలుసుకొని తగు సలహాలు, సూచనలను 27 వ పొగాకు వేలం కేంద్రం నిర్వహణ అధికారి ఏ. శ్రీనివాసరావు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముందుగా బోర్డు అధికారులు కంపెనీ ప్రతినిధులు కొండసముద్రం, బంగారక్క పాలెం, అమ్మ పాలెం గ్రామాల రైతులతో కలిసి పొగాకు తోటలును, బ్యారెనులు, క్యూరింగులు గ్రేడింగులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి పొగాకు రైతులకు పొగాకు సాగులో తీసుకోవలసిన ఉత్తమ యాజమాన్య పద్ధతులను వివరించారు.పక్వానికి వచ్చిన ఆకులు మాత్రమే రెలుపులు చెయ్యాలి.ఇంకా క్యూరింగ్ చేయనప్పుడు తగిన సంఖ్యలో మాత్రమే పొగాకు కర్రలను బ్యారెన్ లో ఎక్కించవలెనని, బ్యారెన్ లు అగ్ని ప్రమాదాలు జరగకుండా గొట్టములపై ఇనుప జల్లడలను ఏర్పాటు చేసికొనవలెనని, క్యూరింగ్ వారిగా మండేలు వేసుకొన వలెనని, మండేలను నాణ్యత దెబ్బతిన్న కుండ తిరగ వేసుకొనవలెనని, క్యూరింగ్ చేయనప్పుడు బ్యారన్ లో క్యూరోమీటర్ అమర్చుట ద్వారా ఉష్ణోగ్రతలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పొగాకు రంగు కాపాడుకోవచ్చునని తెలిపారు. బ్యారన్ లో క్యూరింగ్ చేసేటప్పుడు అగ్ని ప్రమాదం జరిగితే ఆలస్యం కాకుండా పొగాకు బోర్డుకు తెలియజేస్తే మేము ఇన్సూరెన్స్ వాళ్లకు తెలియ జేశారు. టార్పాలిన్ పట్టలను వాడుట ద్వారా క్షేత్రస్థాయిలో పొగాకేతర అన్యపదార్థాలను కలవకుండా నివారించవచ్చునని తెలిపారు.పొగాకు రైతులు అందరూ మంచిగా గ్రేడింగ్ చేసేటప్పుడు అన్య పదార్థాలు లేకుండా చూసుకోవాలని తెలిపారు.

ఈ సంవత్సరం పొగాకు తోటలలో పొగాకు మల్లె ఉందని దానిని పూత వచ్చి విత్తనం ఏర్పడక ముందునే పీకి కాల్చి వేయడం ద్వారా పొగాకుమల్లె ను నివారించవచ్చునని తెలిపారు.వరుసుగా జనుము, నువ్వులు మొదలైన పంటలు వేయటం ద్వారా పొగాకు మల్లెను నివారించవచ్చునని తెలిపారు.


ఈ సంవత్సరం వాతావరణం అనుకుకూలించడం వలన పొగాకు తోటల్లో పేను బంక వలన రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు.

కోల్డ్ స్టోరేజ్ లో నిల్వ చేయించుకునే వాళ్ళు బోర్డు దగ్గరికి వచ్చి బోర్డు క్షేత్ర సహాయాధికారి లేదా బోర్డు క్షేత్రాధికారికి తెలియపరచి అనుమతి తీసుకోవలేను.

ఈ కార్యక్రమంలో పొగాకు పొలాలు క్యూరింగ్, గ్రేడింగ్ లు పరిశీలించి తగు సూచనలు ,జాగ్రత్తలను తీసుకోవాల్సిందిగా రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోలి వెంకటేష్ ,ఐటీసీ మేనేజర్, ఉన్నం.శ్రీనివాసులు

జి.పి.ఐ మేనేజర్.సుబ్బా నాయుడు ,జి.పి.ఐ మేనేజర్ పొగాకు బోర్డు సిబ్బంది కొండసముద్రం, బంగారక్క పాలెం, అమ్మపాలెం రైతులు పాల్గొన్నారు.

## ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు ప్రశంసలు



**క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు,**ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి సదస్సులో ప్రతిభ కనబరచి ప్రశంసలు అందుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని రాయపూర్‌లో ఉన్న కళింగ విశ్వవిద్యాలయం నిర్వహించిన "సస్టైనబుల్ ఫ్యూచర్స్: కల్చరల్, సొసైటీ అండ్ గవర్నెన్స్ ఇన్ ట్రాన్సిషన్" అనే రెండు రోజుల జాతీయ సదస్సులో కళాశాల విద్యార్థులు ఆన్‌లైన్ విధానంలో పాల్గొన్నారు. "వికసిత్ భారత్‌లో సస్టైనబుల్ విలేజెస్" అనే అంశంపై 3వ సంవత్సరం సిఎస్ఇ విద్యార్థినులు పీ. శ్రావణి, ఎన్. నాగవేణి పరిశోధన పత్రాన్ని సమర్పించారు. తమ మొదటి జాతీయ స్థాయి ప్రదర్శనలోనే వారు న్యాయనిర్ణేతల ప్రశంసలు పొందడం విశేషం.ఈ పత్రం సిద్ధీకరణలో కళాశాల డీన్ ముప్పా లక్ష్మణరావు విద్యార్థులకు మార్గనిర్దేశనం చేసి ప్రోత్సహించారు.ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డా. కె. విజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, జాతీయ వేదికపై విద్యార్థులు ప్రతిభ చాటుకోవడం కళాశాలకు గర్వకారణమని తెలిపారు.ప్రిన్సిపాల్ డా. సీహెచ్. రవి కుమార్ విద్యార్థులను అభినందిస్తూ, ఇలాంటి సదస్సులు పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించడంలో కీలకమని పేర్కొన్నారు.వైస్ ప్రిన్సిపాల్ వి. హరి బాబు, అన్ని విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు విజయాన్ని అభినందించారు.

# రూపురేఖలు మార్చేసిన కూటమి ప్రభుత్వం

**అంబులెన్సుల్లో కొత్తగా టెలీమెడిసిన్ విధానం**
**మార్గం మధ్యలోనే బాధితులకు ప్రాథమిక చికిత్స**
**2.5 లక్షల మందికి ఆస్పత్రికి చేరకుండానే నయం**
**టెక్నాలజీ ద్వారా 20 శాతం మరణాల నివారణ**
**బాధితులకు పకడ్బందీగా 'గోల్డెన్ అవర్' అమలు**
**ఎమర్జెన్సీ రోగుల పాలిట సంజీవనిగా అంబులెన్సులు**



క్రైం కౌంటర్ న్యూస్ , మార్చి 03కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 108 అంబులెన్సులు ఎమర్జెన్సీ రోగుల పాలిట సంజీవనిగా నిలుస్తున్నాయి. ఈ ప్రభుత్వంలో దాదాపు 10 లక్షల మందికిపైగా బాధితులు 108 అంబులెన్సు సేవలు పొందితే... అందులో 7.50 లక్షల మంది మాత్రమే ఈ వాహనాల ద్వారా ఆస్పత్రుల్లో చేరి చికిత్స తీసుకున్నారు. మిగిలిన 2.50 లక్షల మందికి టెలీమెడిసిన్ ద్వారా అక్కడికక్కడే వైద్యం అందించి ఇంటికి పంపించేసిన ఈ అంబులెన్సులు "మినీ ఆస్పత్రి" పాత్ర పోషిస్తున్నాయి. రాష్ట్రం మొత్తం 1.75 లక్షల కిలోమీటర్ల మేర రోడ్డు కనెక్టివిటీ ఉంటే.. కూటమి ప్రభుత్వంలో అంబులెన్సులు 1.15లక్షల కి.మీ. అంటే దాదాపు 60 శాతం కనెక్టివిటీని కవర్ చేశాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అరబిందో నిర్వహణలో ఉన్న 108 అంబులెన్సులు 40శాతం రోడ్డు కనెక్టివిటీని మాత్రమే కవర్ చేశాయి. మొత్తంగా గత ప్రభుత్వంలో అస్తవ్యస్తంగా ఉన్న 108 అంబులెన్సుల నిర్వహణను కూటమి ప్రభుత్వం మెరుగుపరిచి ప్రజలకు సమయానికి నాణ్యమైన సేవలందేలా చూస్తోంది. టెక్నాలజీ సాయంతో ప్రతి పల్లెకూ సేవలు విస్తరిస్తూ ప్రజారోగ్య పరిక్షణకు పెద్దపీట వేస్తోంది.

**అంబులెన్సుల్లో టెలీమెడిసిన్...**

కూటమి ప్రభుత్వం 108 అంబులెన్సుల్లో ప్రత్యేకంగా టెలీమెడిసిన్ సేవలు అందుబాటులోకి తెచ్చింది. ఈఆర్సీ (ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్) నుంచి ఈ సేవలందిస్తోంది. అంబులెన్సుల్లో ప్రత్యేకంగా ఎండీటీ (మొబైల్ డేటా టెర్మినల్), సీసీ కెమెరాలతో పాటు స్మార్ట్‌ఫోన్లు అందుబాటులో ఉంచారు. దీంతో పాటు ఈఆర్సీలో ప్రత్యేకంగా 18 మంది వైద్యులను నియమించారు. అంబులెన్సులు ప్రమాదస్థలం లేదా బాధితులున్న ప్రదేశానికి వెళ్లిన వెంటనే ఈఆర్సీలో ఉన్న వైద్యులు అంబులెన్సుల్లో ఉన్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ)తో మాట్లాడి బాధితుల ఆరోగ్య పరిస్థితి, వారి పల్స్, ఆక్సిజన్ లెవల్స్, బీపీ ఎలా ఉన్నాయో తెలుసుకుంటారు. బాధితుడి పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటే వీడియో కాల్ ద్వారా లైవ్‌లోకి వచ్చి బాధితులకు ఎలాంటి వైద్యం అందించాలి, ఏఏ ముందులు ఇవ్వాలో సూచిస్తారు. వారి సూచన మేరకు ఈఎంటీ బాధితులకు ప్రాథమిక చికిత్స అందిస్తారు. అలాగే గుండెపోటు, రోడ్డు ప్రమాద బాధితులకు కూడా రన్నింగ్‌లో ఉండగానే టెలీమెడిసిన్ ద్వారా ప్రాథమిక చికిత్స అందిస్తారు. ఈ విధానం ద్వారా దాదాపు 20 శాతం మంది ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. కూటమి ప్రభుత్వంలో 108 అంబులెన్సుల్లో ఎండీటీ (మొబైల్ డేటా టెర్మినల్) పరికరాన్ని అమర్చారు. ఈ పరికరం ఇటు ఈఆర్సీ సిబ్బందితో పాటు 108 అంబులెన్సు డ్రైవర్, ఈఎంటీని అలెర్ట్ చేస్తుంది. ఏదైనా ఒక ప్రాంతంలో రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు.. అక్కడ నుంచి ఎవరైనా 108కు ఫోన్ చేసినప్పుడు ఈఆర్సీకీ సిబ్బంది కాల్ రీసీవ్ చేసుకున్న వెంటనే లోకేషన్ రిజిస్టర్ అవుతుంది. తర్వాత ఆరీసీ సిబ్బంది బాధితుల వివరాలను నమోదు చేసుకున్న క్షణాల్లో లోకేషన్‌తో సహా ఈ డేటా మొత్తం ఎండీటీ ద్వారా 108 అంబులెన్స్‌కు చేరుతుంది. అంబులెన్సులోని సిబ్బంది వాహనానికి దూరంగా ఉన్నా, నిర్లక్ష్యంగా ఉన్నా, నిద్రావస్థలో ఉన్నా.... ఈఆర్సీ పెద్దగా సైరన్ చేసి పైలట్ (డ్రైవర్), ఈఎంటీని అలర్ట్ చేస్తుంది. ఎండీటీ డేటా ఆధారంగా వారు లోకేషన్‌కు చేరుకుంటారు. బాధితులను ఎక్కించుకుని బయల్దేరాక మార్గ మధ్యలోనే ప్రాథమిక చికిత్స అందిస్తారు.

**మూడేళ్లకే మూలకు చేర్చారు..**

అరబిందో సంస్థ 2020 జూన్‌లో 108 వాహనాల నిర్వహణ బాధ్యతలు స్వీకరించింది. ఈ సంస్థ కోసం గత వైసీపీ ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేసింది. సాధారణంగా 108 అంబులెన్సులు నిర్వహించే సంస్థ కొత్త వాహనాలు కొనుగోలు చేసుకోవాలి. కానీ వైసీపీ ప్రభుత్వం రూ.104 కోట్లు ఖర్చు పెట్టి మూడేళ్లలో 581 కొత్త వాహనాలను అరబిందోకు అందించింది. ఒకవైపు ఆ సంస్థ కొత్త వాహనాలను కొనుగోలు చేయకపోగా ప్రభుత్వం ఇచ్చిన వాహనాలను మూడేళ్లల్లో తుక్కు తుక్కు చేసింది. కనీసం ఇంజన్ ఆయిల్ కూడా మార్చకుండా వాడడంతో మూడేళ్లకే మూలనపడ్డాయి. కూటమి ప్రభుత్వం అరబిందో నుంచి కొత్త నిర్వహణ సంస్థ 768 వాహనాలను తీసుకుంది. అందులో 300 వాహనాలు పనికి రాకుండాపోయాయి. వైసీపీ ప్రభుత్వం అందించిన కొత్త వాహనాలను కూడా షెడ్‌కు చేర్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో వాటి రిపేర్లకే కూటమి ప్రభుత్వం దాదాపు రూ.15 కోట్ల వరకూ ఖర్చు చేయాల్సి వచ్చింది. 227 అంబులెన్సులను పూర్తిగా తొలగించాల్సి వచ్చింది. వీటి విలువ రూ.20 కోట్ల వరకూ ఉంటుంది.

**గోల్డెన్ అవర్ చాలా కీలకం**

గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ వంటి అత్యవసర వైద్య పరిస్థితి ఎదురైనప్పుడు మొదటి 60 నిమిషాలు ఎంతో కీలకం. ఆలోగా ఆస్పత్రికి చేర్చితే రోగి బతికే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే దీన్ని గోల్డెన్ అవర్ అంటారు. అందుకే కూటమి ప్రభుత్వం 108 అంబులెన్సు సేవల్లో ఈ గోల్డెన్ అవర్ విధానాన్ని పక్కాగా అమలు చేస్తూ సత్ఫలితాలు సాధిస్తోంది. నిబంధనల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో ఫోన్ కాల్ వచ్చిన 18 నిమిషాల్లోనే అంబులెన్సు రోగి వద్దకు చేరాల్సి ఉండగా... ప్రస్తుతం సగటున 37 సెకన్ల ఆలస్యంతోనే చేరుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 23 నిమిషాల్లో చేరాల్సి ఉండగా.. సగటున 23.13 నిమిషాలకు, గిరిజన ప్రాంతాల్లో 33 నిమిషాల్లో చేరాల్సి ఉండగా సగటున 31.30 నిమిషాల్లోనే చేరుతున్నాయి. గత ప్రభుత్వంలో పట్టణ ప్రాంతాల్లో సగటున 12.45 నిమిషాలు, గ్రామీణ ప్రాంతాల్లో 12.39 నిమ్నిషాలు గిరిజన ప్రాంతాల్లో 9.30 నిమిషాలు ఆలస్యంగా చేరేవి. ఈ ఆలస్యం కారణంగా బాధితులకు జరగాల్సిన నష్టం జరిగిపోయేది. కూటమి ప్రభుత్వం రూపొందించిన నిబంధనల మేరకు ప్రస్తుతం 108 అంబులెన్సుల ద్వారా 95.58 శాతం రోగులు సగటున 1.05 గంటల్లోనే ఆస్పత్రులకు చేరుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 731 అంబులెన్సులను భవ్య హెల్త్ సంస్థ విజయవంతంగా నిర్వహిస్తోంది. ఇవి కాకుండా అదనంగా 37 బ్యాకప్ వాహనాలను సిద్ధంగా ఉంచుతోంది. గతంలో అరబిందో సంస్థ పేరుకు 768 వాహనాలను నిర్వహించేది. కానీ రోడ్డు మీద 300 వాహనాలు మాత్రమే కనిపించేవి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాహనాలకు ప్రత్యేక ట్రాకింగ్ విధానం పెట్టి, ఏ వాహనం ఎక్కడుంది..? సిబ్బంది అలెర్టుగా ఉన్నారా.. లేదా.. అన్న విషయాన్ని కూడా ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

**అరబిందోపై కాగ్ కన్నెర్ర...**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 108 అంబులెన్సుల పనితీరుపై కాగ్ తీవ్ర ఆరోపణలు చేసింది. అంబులెన్స్ కోసం ఫోన్ కాల్ వచ్చినప్పటి నుంచి నిర్దేశించిన సమయంలోగా అవి రోగులకు చేరలేదని, ఈ అంబులెన్సుల్లో వివిధ పరికరాలు ప్రమాణాల మేరకు పనిచేయలేదని, సిబ్బంది కొరత ఉందని, ఏసీలు పని చేయలేదని, క్రిటికల్ కేసులకు అడ్వాన్స్‌డ్ లైఫ్ సిస్టమ్‌తో కూడిన అంబులెన్సులు కాకుండా.. కనీస సౌకర్యాలున్న వాహనాలను కేటాయించారని గతేడాది జూన్‌లో విడుదల చేసిన నివేదికలో కాగ్ పేర్కొంది. ప్రతి రోజూ సగటున 200 ఎమర్జెన్సీ ఫోన్ కాల్స్‌కు అరబిందో సంస్థ స్పందించేది కాదని స్పష్టం చేసింది. అరబిందో సంస్థ వాహనాలకు సరైన సమయంలో నిర్వహణ చేపట్టకపోవడం వలన 42 వాహనాలు రిపేరుకు కూడా పనికిరాకుండా పోయాయని, 615 అంబులెన్సులకు మేజర్, 103 వాహనాలకు మైనర్ రిపేర్లు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపింది. కాగా, 2025 జూన్‌లో మొత్తం 768 వాహనాల్లో 67 శాతం మాత్రమే వర్కింగ్ కండిషన్‌లో ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం పనిచేసే అంబులెన్స్‌ల సంఖ్యను క్రమేణా పెంచుతూ గతేడాది నవంబరు నాటికి 731 అంబులెన్సులను భవ్య సంస్థ ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చింది.

# విజ్ఞాన యాత్ర



క్రైం కౌంటర్ ప్రతినిధి టి. నాగ బ్రహ్మం కందుకూరు రూరల్,ఏపీఎఫ్ నం. 27 పరిధిలోని పొగాకు రైతులకు అవగాహన కల్పించేందుకు విజ్ఞాన యాత్ర లో భాగంగా ఐటీసీ లిమిటెడ్ సంస్థకు చెందిన ఐటీసీ ట్రేస్సింగ్ చీరాలలో జరిగింది. ఈ పర్యటనలో ఏపీఎఫ్ నం. 27 కు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం పొగాకు ఆకుల గ్రేడింగ్, ప్రాసెసింగ్, త్రెషింగ్ విధానాలు, నాణ్యత ప్రమాణాలు , ఎగుమతి ప్రమాణాలపై రైతులకు ప్రత్యక్ష అవగాహన కల్పించామని ఏఎస్ ఏ. శ్రీనివాస్ రావు అన్నారు.ప్లాంట్ అధికారుల మార్గదర్శకత్వంలో రైతులకు ఆకుల శుద్ధి విధానం, తేమ శాతం నియంత్రణ, గ్రేడింగ్ ప్రమాణాలు, ప్యాకింగ్ విధానం తదితర అంశాలను వివరించారు. అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఉత్తమ నాణ్యత పొగాకు ఉత్పత్తి చేయాలంటే పాటించాల్సిన పద్ధతులను తెలియజేశారు. ఈ విజ్ఞాన యాత్ర పర్యటన ద్వారా రైతులు పొగాకు ప్రాసెసింగ్ ప్రక్రియపై సమగ్ర అవగాహన పొందారని ఆక్షన్ సూపరింటెండెంట్, ఏపీఎఫ్ నం. 27 తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి పర్యటనలు నిర్వహించి రైతుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు చర్యలను తీసుకుంటామని తెలిపారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

**రూరల్ ఎస్ఐ ఏ.బాలకృష్ణ**



క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు, మండలంలోని గ్రామాలలో పేకాట, కోడి పందాలు , తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలను తీసుకుంటామని రూరల్ ఎస్ ఐ ఏ. బాలకృష్ణ హెచ్చరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి గొడవలు అంతే కేసులను నమోదు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణ కొరకు ప్రజలలో అవగాహన సదస్సు లను నిర్వహిస్తామని ఆయన తెలియజేశారు.

# మాజీ సీఎం నాదెండ్ల పేరుతో నకిలీ ఖాతా

క్రైం కౌంటర్ న్యూస్ : తెనాలి, మార్చి 3గత కొద్ది రోజులుగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుపై వైరల్ అవుతున్న వీడియో అనేక వివాదాలకు కారణమవుతోంది. తాజాగా ఈ వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావునూ లాగారు. ఆయన తన ఎక్స్ ఖాతాలో ఆ వైరల్ వీడియోను పోస్టు చేయడం, అది మరింత వైరల్ కావడం వివాదాస్పదమైంది. ఇది అక్కడితో ఆగలేదు. బీఆర్ నాయుడు సొంత చానల్‌లో ఇదో రియాలిటీ షో అని, మిడ్ నైట్ మసాలా వీడియో అని, ఇటువంటి వ్యక్తిని టీటీడీ చైర్మన్‌గా నియమించారని నాదెండ్ల భాస్కరరావే వ్యాఖ్యానం చేసినట్లు ఒక పోస్టును సృష్టించారు. ఈ పోస్టులను చూసిన తెనాలికి చెందిన వెనిగళ్ల నారాయణరావు, జనసేన నాయకులు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 'అది ఫేక్ ఖాతా. దానిని ఎవరు సృష్టించారో అర్థం కావటం లేదు. భాస్కరరావు వయోభారంతో ఏ సాంఘిక మాధ్యమాలూ చూసే పరిస్థితి లేదు. పోస్టులు ఎట్లా చేస్తారనే ఆలోచన కూడా లేకుండా ఆయన పేరుతో వివాదాస్పద పోస్టులు పెట్టటం దారుణం' అంటూ జనసేన శ్రేణులు మండిపడుతున్నాయి. 'జనసేన నేతల ఫిర్యాదుపై కేసు నమోదు చేశాం. దర్యాప్తు చేస్తున్నాం. త్వరలో ఈ నకిలీ ఖాతాల వెనకున్న వారిని పట్టుకుంటాం' అని తెనాలి వన్ టౌన్ సీఐ మల్లికార్జునరావు చెప్పారు.

**మరీ ఇంత బరితెగింపా..!: మంత్రి మనోహర్**

నకిలీ ఎక్స్ ఖాతా ప్రచారంపై నాదెండ్ల భాస్కరరావు కుమారుడు, మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించారు. 'ఇటువంటి తప్పుడు ప్రచారాలతో తాత్కాలికంగా అబద్ధాలను వైరల్ చేద్దామనుకున్నా, ఎక్కువ కాలం దాగవు. ఇప్పటికే కొందరు మహిళలను ఈ వ్యవహారంలోకి లాగారు. చివరకు నా తండ్రి పేరుతోనే నకిలీ ఖాతాలు తెరచి, వివాదాస్పద పోస్టులు ప్రచారం చేయటం చూస్తే వారు ఎంత బరితెగించారో



అర్థమవుతుంది. కేవలం తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారాన్ని పక్కదారి పట్టించడానికే వైసీపీ సోషల్ మీడియా ఇంతటి విషం చిమ్ముతోంది. సాంకేతికంగా జనం అభివృద్ధి చెందారు. ఏది నిజమో, ఏది నకిలీనో తెలుసుకోగల స్థితిలో ఉన్నారు. వైసీపీ నేతలు ఎంతటి అసత్య ప్రచారాలు చేద్దామనుకున్నా నమ్మే పరిస్థితుల్లో ఎవరూ లేరు. కనీసం ఆయన వయస్సుకు కూడా గౌరవం ఇవ్వకుండా, ఆయన పేరుతోనే ఫేక్ ఖాతా సృష్టించారంటే... భవిష్యత్‌లో ఎంతటి తప్పుడు ప్రచారాలు చేసేందుకైనా వెనకాడరని అర్థమవుతోంది. దీనిని ప్రజలు గమనించాలి. నా తండ్రి పేరుతోనే కాదు... ఎవరి పేరుతో ఈ తరహా తప్పుడు ప్రచారాలకు దిగినా ఉపేక్షించేది లేదు. ఈ ఫేక్ ఖాతాలు, ఫేక్ వీడియోల వెనకున్నవారిని వదిలే ప్రసక్తిలేదు' అని మంత్రి మనోమర్ హెచ్చరించారు.

# అంగన్వాడి కార్యకర్తలు నిరసన ర్యాలీ



క్రైం కౌంటర్ ప్రతినిధి కంచర్ల మల్లికార్జున రావు నియోజకవర్గ ఇన్చార్జి కందుకూరు, తమసమస్యలను పరిష్కరించాలనీ అంగన్వాడి కార్యకర్తలు నిరసన ర్యాలీ కార్యక్రమము ను మంగళవారం నిర్వహించారు. పోస్ట్ ఆఫీస్ సెంటర్ లో మానవహారం జరిగింది. సిఐటియు ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం నుంచి పోస్ట్ ఆఫీస్ సెంటర్ వర్క్ ర్యాలీ జరిగింది. విజయవాడ లో అంగన్వాడీ కార్యకర్తలను అరెస్ట్ చేయడం దారుణమని సిఐటియు నాయకులు గౌస్, అంగన్వాడి ప్రాజెక్టు మహిళా నాయకురాలు రాజేశ్వరి ఖండించారు.

## సంప్రోక్షణతో తెరచుకున్న శ్రీగిరి ఆలయం



**ఒంగోలు క్రైం కౌంటర్ ప్రతినిధి,** చంద్రగ్రహణం సందర్భంగా నగరం లోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయాన్ని మంగళవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 7:30 వరకు మూసివేసారు. సాయంత్రం శ్రీగిరి ఆలయ అర్చకులు వేద పండితులు సంప్రోక్షణ నిర్వహించి భక్తులకు శ్రీవారి దర్శన భాగ్యాన్ని కలుగ చేసారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు ఆలూరు లక్ష్మీ కుమారి తదితరులు పర్యవేక్షించారు.

# ఉమ్మడిగా తిప్పికొడదాం

**లడ్డూ వ్యవహారంపై సీఎంతో బీజేపీ నేత మాధవ్ భేటీ**
**వైసీపీపై ఎదురుదాడికి వ్యూహం సిద్ధం**




**క్రైం కౌంటర్ న్యూస్ :** అమరావతి, మార్చి 3 'అధికారంలో ఉండి రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారు.. ఇప్పుడు మనం అన్ని విధాలా బాగు చేస్తుంటే కుట్రలు చేస్తున్నారు.. తిరుమల లడ్డూ ప్రసాదంలో నెయ్యి కల్తీతో హిందువుల ఆగ్రహానికి గురయ్యారు.. అందులో అసలు నెయ్యే లేదని సీబీఐ సిట్ తేలిస్తే.. మనం క్షమాపణ చెప్పాలంటూ పోస్టర్లు వేసి రెచ్చగొడుతున్నారు' అని సీఎం చంద్రబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం మాధవ్ ఉండవల్లిలో సీఎంతో భేటీ అయ్యారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఏకతాటిపై నిలిచి.. వైసీపీ కుట్రలను తిప్పికొట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇందుకోసం ఎదురుదాడి వ్యూహాన్ని సిద్ధం చేసినట్లు సమాచారం. 'అంబటి రాంబాబు, జోగి రమేశ్‌తో తిట్టించేదీ వాళ్లే. మనం సంయమనం పాటించి చట్ట పరంగా చర్య తీసుకుంటే కులం కార్డు తీసేదీ వాళ్లే.. ఇప్పుడు మహిళల పరువు తీసేలా ఫేక్ వీడియోలు సృష్టించి సోషల్ మీడియాలో వదులుతున్నారు.. ఈ దుర్మార్గులకు బుద్ధి చెప్పకుంటే రాష్ట్రంలో కుల, మత చిచ్చులు రేపుతారు.. ముగ్గురం కలిసి ఎన్నికల్లో పోటీ చేశాం.. కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాం.. సైకో పార్టీ కుట్రలనూ ఉమ్మడిగా తిప్పికొడదాం..' అని నిశ్చయించినట్లు తెలిసింది. చంద్రబాబు ఉదయం ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో జరిపిన సమావేశంలోనూ లడ్డూ అంశంపై చర్చించారు. శాసనమండలిలో బుధవారం దీనిపై జరిగే చర్చలో వైసీపీ వాదనను తిప్పికొట్టాలని నిశ్చయించారు.

బీజేపీ సిద్ధాంతాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి: మాధవ్

బీజేపీ మూల సిద్ధాంతాన్ని, నరేంద్ర మోదీ పాలనలో విజయాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జోనల్ వారీగా నిర్వహించిన ప్రశిక్షణా తరగతులు ముగిశాయి. ప్రతి మండల కేంద్రంలోనూ ప్రశిక్షణా తరగతులు నిర్వహించి బీజేపీ మూల సిద్ధాంతాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని మాధవ్ దిశా నిర్దేశం చేశారు.

## దుర్గమ్మ గుడిలో కుంభాభిషేకానికి రండి



**క్రైం కౌంటర్ న్యూస్ :** అమరావతి, మార్చి 3ఇంద్రకీలాద్రిపై ఈ నెల 6 నుంచి 8 వరకు శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో కుంభాభిషేక మహోత్సవం జరుగుతుంది. ఆ ఉత్సవంలో పాల్గొనడానికి రావాలంటూ సీఎం చంద్రబాబుని, దుర్గగుడి పాలక మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ ఈవో శీనా నాయక్, దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ ఆహ్వానించారు. మంగళవారం ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చిన వీరు.. కుంభాభిషేక మహోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆ తర్వాత మంత్రి లోకేశ్‌నూ కలిసి కుంభాభిషేకానికి ఆహ్వానించారు.

# గ్రామీణాంధ్రకు అభివృద్ధి సొబగులు

**అన్ని గ్రామాలకూ 'జల్ జీవన్'తో రక్షిత నీరు**
**విస్తృతంగా మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం**
**సీఎం-డిప్యూటీ సీఎం భేటీలో కీలక చర్చలు**
**గ్రామీణాభివృద్ధి పనులపై ప్రధాన దృష్టి**
**తాజా రాజకీయ పరిణామాలపైనా..**
**రాజ్యసభ ఖాళీల భర్తీపై మాటామంతీ**
**నామినేటెడ్ నియామకాలు వేగవంతం**
**లడ్డూపై మండలిలో వైసీపీ కుయుక్తులను దీటుగా ఎదుర్కోవాలని నిర్ణయం**




**క్రైం కౌంటర్ న్యూస్ :** అమరావతి, మార్చి 3 ముఖ్యమంత్రి చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. మంగళవారం ఉదయం 11.30 గంటలకు ఉండవల్లిలోని సీఎం నివాసానికి వెళ్లిన జనసేనాని.. సుమారు రెండు గంటలపాటు చర్చలు జరిపారు. ప్రధానంగా.. గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ జరిగినట్లు సమాచారం. జల్ జీవన్ మిషన్, రాష్ట్రవ్యాప్తంగా మ్యాజిక్ డ్రెయిన్లు, గ్రామీణ రోడ్ల నిర్మాణం-నిర్వహణ వంటి అంశాలు చర్చకు వచ్చాయి. తాజా బడ్జెట్‌లో జల్‌జీవన్ మిషన్ కింద రూ.4 వేల కోట్లు కేటాయించిన నేపథ్యంలో పనుల పురోగతిపై ముఖ్యమంతితో డిప్యూటీ సీఎం చర్చించారు. గత ప్రభుత్వ హయాంలో జల్‌జీవన్ మిషన్ స్కీంను పూర్తిగా పక్కన పెట్టేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ పథకాన్ని తిరిగి గాడిలో పెట్టారు. రోజుకు ఒక్కో వ్యక్తికి 55 లీటర్ల తలసరి నీటి వినియోగ లక్ష్యాన్ని చేరేలా జల్ జీవన్ మిషన్‌కు రూపకల్పన చేశారు. దీని ద్వారా 100 శాతం గ్రామాలకు రక్షిత నీరు అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పవన్ కల్యాణ్ వివరించారు.

రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై..

సమావేశంలో తాజా రాజకీయ పరిణామాలపైనా చర్చ జరిగినట్లు సమాచారం. రాష్ట్రంలో త్వరలో ఖాళీ అవుతున్న నాలుగు రాజ్యసభ స్థానాలకు అభ్యర్థుల ఎంపిక కూడా ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. సామాజిక సమీకరణల ఆధారంగా మూడు పార్టీల నడుమ సమతుల్యం పాటిస్తూ అభ్యర్థుల ఎంపిక జరపాలని చంద్రబాబు, పవన్ ఏకాభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు పూర్తయిందని.. ఇంకా పలు నామినేటెడ్ పదవులు భర్తీ చేయాల్సి ఉందని, వాటిని వేగవంతం చేయాలని నిర్ణయించారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న తీరుపైనా నేతలు చర్చించుకున్నారు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి అంశాన్ని పక్కదారి పట్టించేందుకు వైసీపీ శాయశక్తులా ప్రయత్నిస్తోందని పవన్ వ్యాఖ్యానించినట్లు సమాచారం. బుధవారం శాసనమండలిలో ఈ అంశంపై చర్చ జరగనున్నందున.. సభలో వైసీపీ కుయక్తులను దీటుగా ఎదుర్కొనేలా కూటమి సభ్యులకు దిశానిర్దేశం చేయాలని ఉభయులూ నిర్ణయించారు.

# ఒంగోలులో రాజకీయ రచ్చ

**కత్తులు దూసుకుంటున్న దామచర్ల, బాలినేని**
**ఆరోపణలు, ప్రత్యారోపణలతో ప్రెస్‌మీట్లు**
**శకుని పాత్ర పోషిస్తున్న వైసీపీ**
**చోద్యంచూస్తున్న కూటమి పార్టీల అధిష్ఠానాలు**




**క్రైం కౌంటర్ న్యూస్ , మార్చి 03** ఒంగోలు ప్రస్తుత ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రాజకీయ ఆరంగ్రేటం నుంచి టీడీపీలోనే కొనసాగుతున్నారు. మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి రాష్ట్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా కాంగ్రెస్ నుంచి వైసీపీలో చేరి ఆ పార్టీలో రాష్ట్రస్థాయి నాయకుడిగా ఎదిగారు. అనూహ్యంగా గత ఎన్నికల అనంతరం బాలినేని వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు. ఇది రాజకీయంగా కూడా ఎవరూ ఊహించని పరిణామం. నిజానికి గత ఎన్నికల సమయం లోనే బాలినేని టీడీపీలో చేరతారన్న ఊహాగానాలు వచ్చా యి. అతన్ని చేర్చుకునేందుకు ఆ పార్టీ కూడా సిద్ధమైంది. అయితే ఎక్కడి నుంచి బాలినేని పోటీచేయాలన్న విషయం లోనే తేడాలొచ్చాయి. బాలినేని ఒంగోలు నుంచే పోటీ చేయాలని పట్టుబట్టగా, టీడీపీ అధిష్ఠానం దర్శి నుంచి అవకాశం ఇస్తామని తేల్చిచెప్పింది. ఆ విషయంలో అప్పట్లో టీడీపీ యువనేత నారా లోకేష్ చెప్పిందే చెల్లింది. అదేసమయంలో బాలినేని బయటకు పోకుండా ఆపుకునేందుకు వైసీపీ అధినేత జగన్ చేసిన ప్రయత్నం ఫలించింది. అయితే వైసీపీ అధికారం కోల్పోయిన కొన్నినెలల తర్వాత బాలినేని ఆ పార్టీకి రాజీనామా చేసి జనసేనలో చేరారు. అందుకు కారణాలు ఏమైనా కూటమి పార్టీలలో ఉన్న ఎమ్మెల్యే జనార్దన్, బాలినేనిల మధ్య మాత్రం సఖ్యత కుదరలేదు.

మొదటి నుంచి సవాళ్లే..

దామచర్ల, బాలినేని ప్రత్యర్థి పార్టీల్లో ఉన్నప్పుడు సవాళ్లు విసురుకున్నారు. అదేతరహాలో ఇప్పుడూ కొనసాగుతున్నారు. ఆ విషయంలో టీడీపీ, జనసేనల అధిష్ఠానాలు చోద్యంచూస్తున్నాయి. మరోవైపు ఎన్నికల తర్వాత వైసీపీ వివిధ కారణాలతో జిల్లాలో మరింత డీలాపడిన మాట వాస్తవం. బాలినేని లేని లోటును ఎవరూ పూడ్చలేకపోయారు. ఇదేసమయంలో అందివచ్చిన అవకాశంలా దామచర్ల, బాలినేనిల మధ్య నెలకొన్న రాజకీయ వివాదాన్ని సొమ్ము చేసుకునేందుకు ఆ పార్టీ సిద్ధమైంది. ఇదిలాఉండగా రాష్ట్రస్థాయిలో టీడీపీ, జనసేన పార్టీల అగ్ర నేతలు సఖ్యతతో ముందుకు సాగుతున్నారు. ఆ రెండు పార్టీల మధ్య విభేదాలు రాకపోతాయా అని ఎదురుచూసిన వైసీపీ అధినాయకత్వం ఆశలు కూడా ఫలించలేదు. ఇటు సీఎం చంద్రబాబునాయుడు, టీడీపీలోనూ, ప్రభుత్వంలోనూ కీలకపాత్ర పోషిస్తున్న నారా లోకేష్, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ల మధ్య సఖ్యత రాజకీయ విశ్లేషకులు ఊహించనంత స్థాయిలో కొనసాగుతోంది. కానీ ఒంగోలులో చూస్తే అటు జనార్దన్, ఇటు బాలినేనిల మధ్య యుద్ధం ఆరంభమైంది. రెండు మూడు నెలలకొకసారి వారిద్దరూ ఢీ అంటే ఢీ అని సవాళ్లు విసురుకుంటున్నారు. కూటమి పార్టీలో ఉన్నామన్న విజ్ఞతతో మెలిగేందుకు ఇద్దరు నాయకులు సిద్ధం కాలేదని తేలిపోయింది. వారిని ఒక గాడిలో నడపాలన్న తపన ఆ పార్టీ రాష్ట్ర నాయకుల్లోనూ కనిపించటం లేదు.


మరుగునపడుతున్న అభివృద్ధి అంశాలు

ప్రత్యర్థి పార్టీల నాయకుల మధ్య జరుగుతున్న పోరు కన్నా తీవ్రస్థాయిలో మాటలయుద్ధం ఈ ఇద్దరి మధ్య ప్రారంభమైంది. గతంలో బాలినేని ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన అనేక అంశాలను జనార్దన్ వేలెత్తిచూపుతున్నారు. ఇప్పుడు కూడా అదే తరహాలో నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలు రాజ్యమేలుతున్నాయంటూ బాలినేని ప్రశ్నించడం ప్రారంభించారు. హైదరాబాద్‌లో ఉంటూ నెలకొకసారి ఒంగోలు వచ్చి నువ్వు చేస్తున్న ఆరోపణలలో నిజాయితీ లేదంటూ జనార్దన్ ప్రతిసవాల్ విసురుతున్నారు. గత వైసీపీ పాలనలో అక్రమాలను ప్రశ్నించే సమయంలో ఇప్పుడు జరుగుతున్న అక్రమాలను ఎందుకు దాచిపెట్టారంటూ బాలినేని సవాల్ విసురుతున్నారు. ఈ రచ్చ మధ్య జరుగుతున్న, జరగాల్సిన అభివృద్ధి అంశాలు మరుగునపడుతున్నాయి. ఈ ఇద్దరి నేతల ఆరోపణల్లో నిజానిజాలు పక్కనపెడితే ఒంగోలు నగరంలో అభివృద్ధి కార్యక్రమాలకు బీజం పడింది మాత్రం నిజం.

వేచి చూస్తున్న వైసీపీ రాజకీయ విశ్లేషకుల అంచనా మేరకు ఇటు జనసేన, అటు వైసీపీ అధిష్ఠానాల వ్యవహారశైలి చర్చనీయాంశమైంది. బాలినేనిని జనసేన అధిష్ఠానం పార్టీలో చేర్చుకున్నా కిందిస్థాయిలో ఆ పార్టీ నాయకుల మధ్య సమన్వయం సాధించడంలో పూర్తిగా విఫలమైంది. మొదటి నుంచి జన సేనలో ఉన్న కొందరు నాయకులు బాలినేనితో కలిసి ప్రయాణించేందుకు సిద్ధంగా లేరు. దీంతో జనసేనలో తొలి నుంచి ఉన్న నాయకుల్లో కొందరు ఒకవైపు.. బాలినేని, అతనితోపాటు వచ్చిన వారు మరోవైపు ఉండి ఆ పార్టీ వ్యవహారాలను కూడా రచ్చకెక్కించారు. ఇదేసమయంలో వైసీపీ విషయానికొస్తే బాలినేని వెళ్లిపోయిన అనంతరం ఆ పార్టీ జిల్లా నాయకత్వం కానీ, ప్రత్యేకించి ఒంగోలు నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాలు కానీ ఏమాత్రం కుదుటపడలేదు. ఇప్పటికీ వైసీపీలోని కొందరు నాయకులు బాలినేనితో సఖ్యతతో కొనసాగుతున్నారు. ఇదేసమయంలో స్థానిక పరిస్థితులతో కొందరు జనసేనలో బాలినేనిని వ్యతిరేకించే వారు టీడీపీ నాయకులకు దగ్గరయ్యారు. దీన్ని గమనించిన వైసీపీ అధిష్ఠానం ఒకవైపు జనసేనలో బాలినేని వ్యతిరేకులను రెచ్చగొట్టడం ప్రారంభించింది. ఇంకోవైపు బాలినేనితో సఖ్యతతో ఉన్న వైసీపీ వారికి ఆయన పట్ల అమితమైన అభిమానం అధిష్ఠానంకు ఉందన్న ప్రచారాన్ని ప్రారంభించింది. తదనుగుణంగా కొందరు వైసీపీ నేతలు ఏదో ఒక అంశాన్ని సాకుగా ఎంచుకుని బాలినేనికి టచ్‌లో ఉంటున్నట్లు తెలుస్తోంది.

రాజుకున్న రాజకీయ వేడి ఇరువురి నేతల ఆరోపణల్లో నిజమెంత అనేది పక్కనపెడితే కుటుంబసభ్యులను కూడా కలపటంతో రాజకీయ వేడి తీవ్రమైంది. దీన్ని వైసీపీ సంబరపడిపోతోంది. ఆపార్టీ నేతలు చాపకింద నీరులా ఇద్దరినీ రెచ్చగొట్టే పనిలో ఉన్నారన్న ప్రచారం సాగుతోంది. దీంతో ఒంగోలులో జరుగుతున్న అభివృద్ధి, రాష్ట్రస్థాయిలో తెలుగుదేశం, జనసేనల మధ్య ఉన్న సఖ్యత మరుగునపడి సరికొత్త రాజకీయ చిచ్చుకు ఈ వ్యవహారం దారితీసే పరిస్థితి కనిపిస్తోంది. ఎమ్మెల్యే జనార్దన్ చెప్పినట్లు బాలినేని స్థానికంగా ఉండకుండా అప్పుడప్పుడు నియోజకవర్గానికి వచ్చిపోతున్న మాట నిజం. బాలినేని అన్నట్లు దామచర్ల కూడా రెండేళ్లు కనపడలేదన్న మాటలో నిజం ఎలా ఉన్నా ఇప్పుడు అది అప్రస్తుతం. ఇప్పుడు జరుగుతుంది, జరగబోతున్నదే ప్రజలకు, పార్టీలకు కావాలి. అంతకన్నా ఇద్దరూ ఒంగోలు అభివృద్ధికన్నా వ్యక్తిగత రాజకీయ అంశాలకే ప్రాధాన్యతనిస్తారన్న అభిప్రాయం ప్రజల్లో పెరిగిపోతోంది. రాజకీయంగా కూటమి పార్టీలకు మచ్చతెచ్చే ఈ వ్యవహారానికి తెరదించేందుకు రాష్ట్ర నాయకత్వాలు జోక్యం చేసుకుంటాయా? వైసీపీ ఆడుతున్న శకుని పాత్ర ఫలిస్తుందా? అనేది వేచిచూడాలి.

# సినిమా



## నా కిడ్నీ మార్పిడికి చిరంజీవి 70 లక్షలు ఖర్చు చేశాడు.

సినీ పరిశ్రమలో విలన్ గా పేరుగాంచిన నటుడు పొన్నంబళం. ఒకప్పుడు తెలుగు, తమిళం భాషలలో ఎన్నో చిత్రాల్లో విలన్ పాత్రలతో పాపులర్ అయ్యాడు. అయితే కొన్నాళ్లుగా సినిమాలకు దూరంగా ఉంటున్నాడు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అతడు.. తన ఆరోగ్యం విషయంలో చిరంజీవి చేసిన సాయాన్ని గుర్తుచేసుకున్నారు. కిడ్నీలు పూర్తిగా పాడై, తీవ్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ, జీవనంపై ఆశలు కోల్పోయి, మరణించాలని కోరుకున్న సమయంలో చిరంజీవిని సంప్రదించినట్లు ఆయన తెలిపారు. ఆ కష్టకాలంలో పొన్నంబళం చిరంజీవికి ఫోన్ చేశానని.. అప్పుడు చిరంజీవి అప్పుడు నేపాల్‌లో షూటింగ్‌లో ఉన్నారని అన్నారు. పొన్నంబళం తన పరిస్థితిని వివరించగానే, చిరంజీవి నిమిషాల వ్యవధిలోనే స్పందించారని చెప్పుకొచ్చింది. "ఏం బాధపడొద్దు, నేనున్నాను" అని భరోసా ఇచ్చి, వెంటనే అపోలో ఆసుపత్రి నుంచి ఫోన్ వస్తుందని తెలిపారు. అన్నట్లుగానే, పది నిమిషాల్లోపు అపోలో ఆసుపత్రి నుంచి ఫోన్ వచ్చింది. పొన్నంబళం వెంటనే ఆసుపత్రికి వెళ్లగా, అప్పటికే డాక్టర్ సుబ్బారావు ఆయన కోసం సిద్ధంగా ఉన్నారని చెప్పుకొచ్చారు.పొన్నంబళం మొదట డయాలసిస్ కోసం ఆసుపత్రికి వెళ్తున్నానని భావించానని.. అయితే, డాక్టర్ సుబ్బారావు డోనర్ గురించి అడగగా, చిరంజీవి కిడ్నీ మార్పిడికి ఏర్పాట్లు చేశారని తెలుసుకుని ఆశ్చర్యపోయానని అన్నారు. తన మేనల్లుడు కిడ్నీ దాతగా మారడంతో, వారిద్దరికీ ఒకేసారి చికిత్సను ప్రారంభించారు. చికిత్సకు ముందు రోజు రూ. 80,000 ఖర్చుతో పూర్తి స్థాయి శరీర పరీక్షలు జరిగాయి. చిరంజీవి ఆ ఖర్చులు గురించి ఏమీ ఆలోచించకుండా, "నువ్వు నా తమ్ముడివి, చికిత్స చేసుకో" అని ప్రోత్సహించారని చెప్పుకొచ్చారు. ఫిబ్రవరి 10న ఇద్దరికీ శస్త్రచికిత్స విజయవంతంగా జరిగింది. ఈ మొత్తం ప్రక్రియకు రూ. 70 లక్షలు ఖర్చయినట్లు పొన్నంబళం వెల్లడించారు. చిరంజీవి అందించిన ఈ సహాయం తన జీవితంలో మర్చిపోలేనిదని, ఇప్పుడు తాను ఆరోగ్యంగా ఉన్నానని చెప్పారు.తన కష్టకాలంలో తనకు అర్జున్, కే.ఎస్. కుమార్, శరత్‌కుమార్ వంటి ఇతర కళాకారులు కూడా సహాయం చేశారని పొన్నంబళం గుర్తు చేసుకున్నారు. శరత్‌కుమార్‌కు కూడా ఒకప్పుడు చిరంజీవి సహాయం చేశారని, దానిని శరత్‌కుమార్ గుర్తుంచుకుని తనకు సహాయం చేశారని ఆయన పేర్కొన్నారు. కిడ్నీ సమస్యల కారణంగా తాను 126 కిలోల నుంచి 82 కిలోలకు తగ్గిపోయి, దాదాపు 44 కిలోల బరువు కోల్పోయానని చెప్పారు. ఆ సమయంలో తీవ్ర నిరాశతో పోరూర్ ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి, తన ప్రాణాలు తీసుకోవాలని అనుకున్నానని, కానీ చిరంజీవి పేరు గుర్తురావడంతో ఆయనకు ఫోన్ చేశానని తెలిపారు.





## బీట్‌రూట్‌తో సూపర్ టేస్టీ జ్యూస్‌లు..

బీట్‌రూట్... ఇది కేవలం కూరగాయ మాత్రమే కాదు, ఆరోగ్యానికి ఉపయోగపడే సహజ ఔషధం అంటున్నారు ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు. బీట్‌రూట్ పుష్కలమైన పోషకాలను కలిగి ఉంటుంది. క్రమం తప్పకుండా వీటిని మీ ఆహారంలో భాగంగా తీసుకుంటే..రక్తపోటు నుంచి గుండె ఆరోగ్యం వరకు అనేక సమస్యలకు సహజ పరిష్కారంగా పనిచేస్తాయి. అధిక రక్తపోటుతో బాధపడేవారికి బీట్‌రూట్ తినడం చాలా మంచిది. ఇందులో ఉన్న కార్బోహైడ్రేట్లు శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. ప్రతిరోజూ బీట్‌రూట్ తింటే శక్తి స్థాయిలు పెరుగుతాయి. బీట్‌రూట్‌ను వివిధ రూపాల్లో తీసుకోవచ్చు. కావాలంటే సలాడ్లు, జ్యూస్‌ల రూపంలో కూడా వీటిని సులభంగా తీసుకోవచ్చు. బీట్‌రూట్‌తో తయారు చేసే టేస్టీ జ్యూస్‌లు ఇక్కడ చూద్దాం..

కేవలం బీట్‌రూట్ ముక్కలను గ్రైండ్ చేసి బీట్‌రూట్ జ్యూస్ తయారు చేస్తారు. బీట్‌రూట్ జ్యూస్ తాగడం వల్ల బాడీకి కావాల్సిన శక్తి లభిస్తుంది. బీట్‌రూట్, క్యారెట్ రెండు కలిపి జ్యూస్ తయారు చేయవచ్చు. ఈ జ్యూస్ తాగడానికి రుచికరంగా ఉంటుంది. క్యారెట్, బీట్‌రూట్ జ్యూస్ తాగితే రక్తహీనత తగ్గుతుంది.

బీట్‌రూట్, అల్లం: బీట్‌రూట్‌లో అల్లం కలిపి జ్యూస్ తయారు చేసుకుని తాగొచ్చు. బీట్‌రూట్, అల్లం జ్యూస్ తాగితే జీర్ణ సమస్యలు తగ్గుతాయి.బీట్‌రూట్, యాపిల్ జ్యూస్: బీట్‌రూట్ ముక్కలు, యాపిల్ ముక్కలు కలిపి టేస్టీ జ్యూస్ తయారు చేసుకోవచ్చు. ఇది ఓవరాల్ హెల్త్‌ను కాపాడుతుంది.

బీట్‌రూట్, పుదీనా: బీట్‌రూట్ ముక్కల్లో పుదీనా ఆకులు కలిపి జ్యూస్ తయారు చేసుకోవాలి. ఈ జ్యూస్ టేస్టీగా ఉంటుంది.

బీట్‌రూట్, నిమ్మరసం:బీట్‌రూట్ జ్యూస్‌లో నిమ్మరసాన్ని కలిపితే టేస్ట్ బాగుంటుంది. వీటిలోని పోషకాలు ఇమ్యూనిటీ పెంచుతాయి.

బీట్‌రూట్, దానిమ్మ: బీట్‌రూట్ ముక్కలు, దానిమ్మ గింజలు కలిపి మిక్సీ పట్టాలి. ఈ జ్యూస్ టేస్టీగా ఉంటుంది. బీట్‌రూట్, దానిమ్మ జ్యూస్ తాగడం వల్ల హీమోగ్లోబిన్ లెవెల్స్ పెరుగుతాయి.

బీట్‌రూట్, టమాటా: బీట్‌రూట్ ముక్కల్లో టమాటా ముక్కలు కలిపి జ్యూస్ చేసుకుని తాగొచ్చు. ఇది టేస్టీగా ఉంటుంది.

ఖాళీ కడుపుతో: బీట్‌రూట్ జ్యూస్‌ను తాగేటప్పుడు ఖాళీ కడుపుతో తాగితే మంచిది. పోషకాలు బాగా అందుతాయి. హెల్తీగా ఉండొచ్చు.



## ఖర్చు తక్కువ.. ప్రయోజనాలు ఎక్కువ.

బార్లీలో ఎన్నో పోషకాలు, ఔషధ గుణాలు దాగున్నాయి.. అందుకే.. బార్లీ నీటిని తప్పనిసరిగా తాగాలని ఆయుర్వేద నిపుణులు పేర్కొంటారు. బార్లీలో ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి.. మాంగనీస్, సెలీనియం, ఫాస్పరస్, రాగి, యాంటీఆక్సిడెంట్లకు బార్లీ ప్రసిద్ధి.. బార్లీ నీరు.. ఎన్నో అనారోగ్య సమస్యలకు సహజమైన పానీయం.. దీనిద్వారా.. రోగనిరోధక శక్తి పెరగడంతోపాటు.. కొలెస్ట్రాల్ తగ్గుతుంది. జీర్ణక్రియను మెరుగుపరిచి.. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతాయి.. గుండె ఆరోగ్యానికి, హైడ్రేట్ గా ఇది అత్యంత ఉత్తమమైన ఆహారమని పేర్కొంటున్నారు ఆరోగ్య నిపుణులు..

అందుకే.. బార్లీ, ఒక సురక్షితమైన, బహుముఖ ధాన్యం.. ఇది అనేక ఆరోగ్య సందేహాలకు పరిష్కారం చూపుతుందని పేర్కొంటున్నారు. ఇది కేవలం బరువు తగ్గడానికి మాత్రమే కాకుండా, పలు కీలకమైన వైద్యపరమైన ప్రయోజనాలకు కూడా తోడ్పడుతుంది.

బార్లీ వాటర్ ప్రయోజనాలు..

బరువు తగ్గడం – డిటాక్సిఫికేషన్: బార్లీ ప్రాథమిక ప్రయోజనాలలో ఒకటి దాని డిటాక్సిఫికేషన్ సామర్థ్యం. బార్లీలోని సమృద్ధిగా ఉండే కరిగే, కరగని పీచు పదార్థం (ఫైబర్) శరీరంలోని వ్యర్థ పదార్థాలను సమర్థవంతంగా బయటకు పంపడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ ప్రక్రియ బరువు తగ్గడంలో సహాయపడటమే కాకుండా, శరీరంలోని విష పదార్థాలను తొలగిస్తుంది.

మెరుగైన జీర్ణక్రియ – గట్ ఆరోగ్యం: బార్లీలోని అధిక ఫైబర్ కంటెంట్ గట్ ఆరోగ్యానికి అత్యంత ముఖ్యమైనది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచి, పేగు కదలికలను క్రమబద్ధీకరిస్తుంది. మలబద్ధకం వంటి సమస్యలతో బాధపడేవారికి ఇది ఒక అద్భుతమైన పరిష్కారం. బార్లీ ఉప్మా, బార్లీ జావ, బార్లీ కిచిడీ లేదా బార్లీ సంకటి రూపాల్లో దీనిని తీసుకోవచ్చు. అయితే, వడియాలు వంటి ప్రాసెస్ చేయబడిన బార్లీ స్నాక్‌లను నివారించి, బార్లీ ధాన్యాలను మొలకెత్తించి (స్ప్రౌటెనింగ్) తీసుకోవడం మరింత ఆరోగ్యకరమైన ఎంపిక. మధుమేహం నియంత్రణ: డయాబెటిస్ ఉన్నవారికి బార్లీ చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. దానిలోని అధిక పీచు పదార్థం, బీటా-గ్లూకాన్‌లు రక్తంలో ఇన్సులిన్ స్పైక్‌లను నియంత్రించడంలో సహాయపడతాయి. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. కాబట్టి మధుమేహ రోగుల ఆహారంలో బార్లీని ఒక ముఖ్యమైన ధాన్యంగా చేర్చుకోవచ్చు. దీనిలోని ఫైటోకెమికల్స్ కూడా షుగర్ నియంత్రణకు తోడ్పడతాయి. కిడ్నీ – గాల్ బ్లాడర్ స్టోన్స్ నివారణ: బార్లీ కిడ్నీ రాళ్లను నివారించడంలో, వాటిని తగ్గించడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది. పరిశోధనల ప్రకారం, బార్లీని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కిడ్నీ రాళ్ల పరిమాణం తగ్గి, చిన్న చిన్న ముక్కలుగా విడిపోయి, మూత్రం ద్వారా సులభంగా బయటకు వెళ్లేలా చేస్తుందని పేర్కొంటున్నారు. ఇదే విధంగా, బార్లీ గాల్ బ్లాడర్ స్టోన్స్ ఏర్పడటాన్ని నిరోధించడంలో కూడా ఉపయోగపడుతుంది. వేగంగా బరువు తగ్గే (రాపిడ్ వెయిట్ లాస్) సందర్భాలలో గాల్ బ్లాడర్ స్టోన్స్ ఏర్పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

## సిస్టమ్ మార్చండి.. బోర్డుపై అఫ్రిది ఫైర్

టీ20 వరల్డ్ కప్ 2026లో పాకిస్థాన్ జట్టు ప్రస్థానం అత్యంత దారుణంగా ముగిసింది. కనీసం సెమీఫైనల్ చేరుతుందనుకున్న ఆ జట్టు సూపర్ 8 దశలోనే ఇంటిముఖం పట్టడంతో ఆ దేశంలో ఆగ్రహజ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వైఫల్యానికి బాధ్యులను చేస్తూ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఆటగాళ్లపై కఠిన చర్యలకు దిగినట్లు సమాచారం. జట్టులోని ప్రతి ఆటగాడికి రూ.50 లక్షల జరిమానా విధించాలని పీసీబీ నిర్ణయించినట్లు వార్తలు వస్తున్నాయి. బోర్డు నుంచి ఇంకా అధికారిక ప్రకటన రానప్పటికీ, ఈ వార్త పాక్ క్రికెట్ వర్గాల్లో పెను దుమారాన్ని రేపుతోంది.

ఈ కఠిన నిర్ణయానికి ప్రధాన కారణం భారత్ చేతిలో ఎదురైన ఘోర పరాజయమేనని తెలుస్తోంది. గ్రూప్ దశలో అమెరికా, నెదర్లాండ్స్, నమీబియా వంటి చిన్న జట్లపై గెలిచినప్పటికీ, టీమిండియా చేతిలో ఓడిపోవడం పాక్ బోర్డుకు మింగుడుపడలేదు. ఇక సూపర్ 8లో న్యూజిలాండ్‌తో మ్యాచ్ వర్షం వల్ల రద్దు కావడం, ఇంగ్లాండ్‌తో ఓటమి, శ్రీలంకపై నామమాత్రపు విజయం సాధించడంతో పాకిస్థాన్ సెమీస్ రేసు నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. సల్మాన్ అలీ ఆగా సారథ్యంలో బరిలోకి దిగిన పాక్ జట్టు ఏ దశలోనూ పటిష్టమైన జట్టుగా కనిపించకపోవడం అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది.

పీసీబీ తీసుకున్న జరిమానా నిర్ణయంపై పాక్ మాజీ దిగ్గజం షాహిద్ అఫ్రిది నిప్పులు చెరిగారు. జరిమానాలు వేయడం వల్ల ఆట మెరుగుపడదని, ఇది చాలా సంకుచితమైన ఆలోచన అని ఆయన మండిపడ్డారు. కేవలం డబ్బులు వసూలు చేస్తే సరిపోదని, అసలు సమస్య క్రికెట్ వ్యవస్థలో ఉందని అఫ్రిది విమర్శించారు. వరుసగా విఫలమవుతున్న ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించి, వారిని మళ్లీ డొమెస్టిక్ క్రికెట్ ఆడి ఫామ్ నిరూపించుకోమని చెప్పాలని ఆయన సూచించారు. జట్టులో కొత్త రక్తాన్ని నింపాల్సిన సమయం వచ్చిందని, జరిమానాలు వేయడం వల్ల ఆటగాళ్లలో భయం పెరుగుతుందే తప్ప టాలెంట్ బయటకు రాదని అఫ్రిది ఘాటుగా స్పందించారు.

సోషల్ మీడియాలో కూడా ఈ విషయంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కొందరు బోర్డు నిర్ణయాన్ని సమర్థిస్తుంటే, మరికొందరు మాత్రం అఫ్రిది మాటల్లో నిజముందని అభిప్రాయపడుతున్నారు. ఆటగాళ్ల జీతాల నుంచి కోత విధించడం కంటే, మేనేజ్మెంట్ లో మార్పులు చేయాలని ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు. మొత్తానికి టీ20 వరల్డ్ కప్ ఓటమి పాకిస్థాన్ క్రికెట్‌ను కోలుకోలేని దెబ్బ తీసింది. మరి రాబోయే రోజుల్లో బోర్డు ఎలాంటి ప్రక్షాళన చేపడుతుందో చూడాలి.



## 'టీమిండియాపైనే ఓడిపోతారా..

టీ20 ప్రపంచకప్ 2026 టోర్నమెంట్‌లో పాకిస్తాన్ క్రికెట్ జట్టు నిరాశాజనకమైన ప్రదర్శనతో ఇంటిదారి పట్టింది. సూపర్ 8 దశ వరకు చేరుకున్నప్పటికీ, కీలక మ్యాచ్‌లలో ఓడిపోయి సెమీ-ఫైనల్స్‌కు అర్హత సాధించలేకపోయింది. ఈ దారుణ వైఫల్యం తర్వాత, పాకిస్తాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ఆటగాళ్లపై కఠినమైన చర్యలకు ఉపక్రమించినట్లు నివేదికలు చెబుతున్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం, పీసీబీ గ్రూప్ దశలో భారత్ చేతిలో ఓడిపోయినందుకు గానూ, ప్రతి ఆటగాడికి 50 లక్షల పాకిస్తాన్ రూపాయల(భారత కరెన్సీలో సుమారు 16 లక్షలు) భారీ జరిమానా విధించింది. ఈ జరిమానాను చెల్లించడంలో విఫలమైతే జట్టు నుంచి తొలగిస్తామని కూడా పీసీబీ హెచ్చరించినట్లు తెలుస్తోంది. పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ ఈ ఆదేశాలు జారీ చేసినట్లు వార్తలు వచ్చాయి.

పీసీబీ నిర్ణయంపై పాకిస్తాన్ మాజీ క్రికెటర్లు తీవ్రంగా స్పందించారు. మొహ్సిన్ నఖ్వీ తీరును ప్రశ్నిస్తూ, "ఆటగాళ్లు 50 లక్షలు కట్టడం ఎక్కడైనా ఉందా? పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ బుర్ర పనిచేస్తోందా.?" అని మండిపడ్డారు. కొత్త నిబంధనలు తీసుకువచ్చి పాకిస్తాన్ క్రికెట్ వ్యవస్థను నాశనం చేస్తున్నాడని ఆరోపించారు. 50 లక్షల రూపాయల కోసం ఆటగాళ్లు ఎక్కడికి వెళ్ళాలని, డబ్బులు చెట్లకు కాస్తున్నాయా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సరిగ్గా ఆడకపోతే ఆటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి గానీ, డబ్బులు వసూలు చేయడం సరికాదని మాజీలు విమర్శించారు.

ఆటగాళ్ల ప్రదర్శన సరిగ్గా లేకపోతే ఒక్కొక్కరిపై రెండు సంవత్సరాల పాటు వేటు వేయాలని సూచించారు. అలాంటి కఠిన చర్యల ద్వారా మాత్రమే పాకిస్తాన్ ఆటగాళు సరైన దారిలోకి వస్తారని పేర్కొన్నారు. పాకిస్తాన్ జట్టులో ఈ విధమైన సంక్షోభం నెలకొన్న వేళ, టీమిండియా టోర్నమెంట్‌లో అద్భుతమైన ప్రదర్శనను కనబరుస్తోంది. సూపర్ 8లోని తమ చివరి మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై విజయం సాధించి సెమీ-ఫైనల్స్‌లోకి ఘనంగా అడుగుపెట్టింది. అంతేకాకుండా, మూడో టీ20 ప్రపంచకప్ టైటిల్‌ను కైవసం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H.No. 8-1-94, Nekunampuram, Pokur, Prakasam, Andhra Pradesh - 523113. Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2843. Ph:9849707349 email:kvp6858@gmail.com